
## జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ ఎత్తివేయాలి



కాగజ్‌నగర్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, మార్చి 15 : మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కాగజ్‌నగర్ పట్టణంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు సీపీ రాజ్ కుమార్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంబాల ఓదెలు, కాగజ్‌నగర్ మండల అధ్యక్షుడు ఆవుల రాజకుమార్, నాయకులు పార్వతి, అంజన, మాజీ కౌన్సిలర్ కన్నయ్య, హనుమంతు, రేణిగుంట్ల శ్రీను, మారుపాక శోభన్, షాకీర్, ప్రశాంత్, రవి సర్కార్, నరేందర్, రాజేశ్, శ్రీనివాస్, భీమన్కర్ రవి, సోమయ్య, విజయ్, కమల, మామిడాల పద్మా గౌడ్, ఉమా, లావణ్య, రమాదేవి పాల్గొన్నారు.

## ఆదివాసులకు అండగా ఉంటాం



గిరిజనులకు సరుకులు అందజేస్తున్న డీసీపీ, ఏసీపీ

తాండూర్, మార్చి 15 : ఆదివాసులకు అండగా ఉంటామని మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. పోలీసులు మీ కోసంలో భాగంగా శనివారం మాదారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెజ్జాల గ్రామంలో రాబిన్ హుడ్ ఆర్మీ ఎన్జీవో హైదరాబాద్, స్నోమ్యాన్ సహకారంతో తాండూర్ సీఐ కుమారస్వామి ఆధ్వర్యంలో 365 కుటుంబాలకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, సంస్థ ప్రతినిధులు, నాయకులతో కలిసి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. డీసీపీ మాట్లాడుతూ గిరిజన పిల్లలు కష్టపడి చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజనులకు స్ఫూర్తిని కలిగించేలా కార్యక్రమాన్ని చేపట్టిన తాండూర్ సీఐ కుమారస్వామి, మాదారం ఎస్ఐ సౌజన్యలను డీసీపీ అభినందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఉన్నత అధికారులను పెద్దలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం డీసీపీతో పాటు ఏసీపీ ఇతరత్రా పోలీసు అధికారులు, నాయకులు గిరిజనులతో కలిసి భోజనం చేశారు. నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, ఎస్ఐలు కిరణ్‌కుమార్, విజయ్, గంగారాం పాల్గొన్నారు.



నీటి కోసం ఎదురుచూస్తున్న ఎనోలి గిరిజనులు



రాత్రి వేళ పంపు వద్ద నీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు



ట్యాంకర్ ద్వారా వచ్చిన నీటిని పట్టుకుంటున్న ఎనోలి గ్రామస్తులు

# ఎనోలిలో ఎన్నాళ్లీ నీటి గోస


### కేసీఆర్ సర్కారులో ఇంటింటికీ నల్లా నీరు

- ఏడాదవుతున్నా మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు కరువు
- ట్యాంకర్ ద్వారా నామమాత్రంగా సరఫరా
- తాగు నీటి కోసం తల్లడిల్లుతున్న గిరిజనులు
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/వాంకిడి, మార్చి 15 : బీఆర్ఎస్ సర్కారు ఆ ఊరిలో ఇంటింటికీ తాగు నీరందించగా, ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమాని గిరిజనం పడరాని పాట్లు పడుతున్నది. మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేసే నాథుడు లేకపోవడంతో గుక్కెడు నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొన్నది.

#### ఎనోలిలో తాగు నీటి తిప్పలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం ఎనోలి గ్రామంలో సుమారు 25 కుటుంబాలుండగా, 200 వరకు జనాభా ఉంది. కేసీఆర్ సర్కారు మిషన్ భగీరథ పథకం ద్వారా ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మించి ఇంటింటికీ నల్లాలు ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేసింది. ఏడాది క్రితం పైపులైన్ పాడవడంతో తాగు నీటికీ తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. గ్రామస్తులు గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామంలో రెండు చేతి పంపులున్నప్పటికీ భూగర్భ జలాలు అడుగంటి నీరు సరిగా రావడం లేదు. చేతి పుంపుల వద్ద గంటల తరబడి పనులన్నీ వదులుకొని అవసరాలు తీర్చుకుంటున్నారు. తాగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టడంతో స్పందించిన అధికారులు గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పైపులైన్‌లు సరిచేసి శాశ్వతంగా నీరు సరఫరా చేయాల్సిందిపోయి ఇలా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం సరికాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇకనైనా స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకుంటున్నారు.



నిరుపయోగంగా మారిన మిషన్ భగీరథ నీటి ట్యాంకు

## తాగు నీటికి తండ్లాట

- రాజారంలో పాడైపోయిన మోటర్
- మరమ్మతులు చేయించని అధికారులు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు

పనిచేయని బోరుబావి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు





కావడితో నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తుడు

కోటపల్లి, మార్చి 15 : కోటపల్లి మండలం రాజారం గ్రామస్తులు తాగు నీటి కోసం తల్లడిల్లుతున్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో నెలరోజుల క్రితం బోరుబావి విద్యుత్ మోటర్ చెడిపోయింది. సుమారుగా వంద కుటుంబాలు ఉండే ఈ కాలనీలో నీటి సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు సుదూర ప్రాంతాలకు వెళ్లి కావడితో నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసినా తమను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ట్యాంక్‌ల ద్వారా నీరు సరఫరా చేస్తామన్నారు.

## అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు మంచిర్యాల విద్యార్థిని



జాతీయ స్థాయి సైన్స్ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మూతో మాట్లాడుతున్న విద్యార్థిని సాయిశ్రీవల్లి

నస్పూర్, మార్చి 15 : మంచిర్యాలలోని శ్రీ చైతన్య పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సాయిశ్రీవల్లి అంతర్జాతీయ జపాన్ సకురా సైన్స్ సదస్సుకు ఎంపికైందని డీఈవో యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. మన దేశం నుంచి సకురాకు 54 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ముగ్గురు విద్యార్థులున్నారని, ఇందులో శ్రీవల్లి ఉండడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. జూన్ 15 నుంచి 21వ తేదీ వరకు జపాన్ సకురా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్త్రీల నెలవారీ రుతుక్రమం ప్రక్రియలో వినియోగిస్తున్న రసాయన శానిటరీ ప్యాడ్ వల్ల కలిగే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం చూపాలని స్త్రీ రుతుమిత్ర కిట్ పరికరాన్ని సాయిశ్రీవల్లి సొంతంగా రూపొందించిందని పేర్కొన్నారు. ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ 2020–21 పోటీల్లో పాల్గొని ఉత్తమంగా నిలిచిందని, అలాగే ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఇంటర్ పునర్‌షిప్–2023 కార్యక్రమానికి కూడా ఆహ్వానం అందుకొని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నుంచి ప్రశంసలు అందుకుందని తెలిపారు. సాయి శ్రీవల్లిని డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, సెక్టోరల్ అధికారులు శ్రీనివాస్, చౌదరి, సత్యనారాయణమూర్తి, యశోదర, చైతన్య పాఠశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జోబిన్ అభినందించారు.

# పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.6.82 కోట్లు



ఆస్తి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి, కారోబార్

### మంచిర్యాల జిల్లాలో ఇప్పటికే 90 శాతం పూర్తి

- ఇక మిగిలింది 16 రోజులే
- వందశాతం పూర్తి చేయాలని కార్యదర్శులకు ఆదేశాలు



దొనబండ గ్రామ పంచాయతీ కార్యాలయం

హాజీపూర్, మార్చి 15 : జిల్లాలోని 306 (ఇటీవల ఐదు జీపీలు కార్పొరేషన్‌లో కలిశాయి) గ్రామ పంచాయతీల్లో వందశాతం ఆస్తి పన్నులు వసూలు చేసేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది. 2024–2025 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా రూ.6.82 కోట్లు టార్గెట్ కాగా, రూ. 6.20 కోట్లు వసూలు చేయడంతో 90 శాతం పూర్తయ్యింది. ఇక 16 రోజులే మిగిలి ఉండగా, మిగతా 10 శాతం వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నారు. మార్చి నెలాఖారులోగా వంద శాతం వసూలు చేయాలని ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్లు జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు.

#### పల్లెల్లో ప్రత్యేక పాలన

సర్పంచుల పదవీకాలం ఇటీవల పూర్తికాగా, ప్రత్యేకాధికారుల పాలన సాగుతున్నది. నిధులు లేక పల్లెల్లో అభివృద్ధికుంటు పడింది. దీంతో నిధులు సమకూర్చుకునేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే వందశాతం ఆస్తిపన్ను వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

#### బకాయిలే లేకుండా

త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశముండగా, సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీలో ఉండేవారంతా తమ ఆస్తి పన్నులు చెల్లిస్తున్నారు. ఆస్తి పన్నుతో పాటు వార సంత, కమర్షియల్ లైసెన్స్‌లు, ఇండ్ల నిర్మాణ అనుమతుల పన్నులను ప్రణాళికాబద్ధంగా వసూలు చేస్తున్నారు.

#### అదనపు పని భారం

గ్రామ పంచాయతీ కార్యదర్శులు పని భారంతో సతమతమవుతున్నట్లు చెబుతుండగా, తాజాగా పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటూ ఆదేశాలు రావడంతో తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే పారిశుధ్య పనుల నిర్వహణతో పాటు ఉపాధి హామీ పనుల పర్యవేక్షణ, కాంపోస్టు షెడ్‌లు, నర్సరీల నిర్వహణ, డీఎస్ఆర్, యాప్ అప్‌లోడ్‌లతో బిజీగా ఉంటుండగా, ఇప్పుడు ఆస్తి పనులు 100 శాతం వసూలు చేయాలని ఆదేశాలు రావడంతో వారిపై మరింత ఒత్తిడి పడుతున్నది.

#### 100 శాతం వసూలు చేస్తాం..




జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని కార్యదర్శులకు ఇప్పటికే సూచించాం. ఇప్పటి వరకు 90 శాతం ఆస్తి పన్నులు వసూలు చేశాం. లక్ష్యంలోగా మిగతా 10 శాతం వసూలు చేస్తాం..

**- వెంకటేశ్వర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి**

## ఏఐ విద్యతో విప్లవాత్మక మార్పు

మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



వెంకట్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్



విద్యార్థినికి పరీక్ష ప్యాడ్ అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే

లక్షెట్టిపేట, మార్చి 15 : ఏఐ విద్యతో విప్లవాత్మక మార్పు వస్తుందని, విద్యార్థుల్లో పఠనా సామర్థ్యాలను పెంపొందించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ.) ద్వారా బోధన అందించడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎఫ్.ఎల్.ఎన్.–ఏ.ఎక్స్.ఎల్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీఈవో యాదయ్య, తహసీల్దార్ దిలీప్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, ఏక్ స్టెప్ ఫౌండేషన్ల సహకారంతో జిల్లాలో తొలి విడుతగా 7 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి ల్యాబ్‌లు ఏర్పాటు చేసిందని, వచ్చే వారం మరిన్ని పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరీక్షించడంతో పాటు స్వయంగా పాఠ్యాంశాలను బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

#### సాంకేతిక విద్యను సద్వినియోగించుకోవాలి : కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే

రెబ్బెన, మార్చి 15 : కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ద్వారా అందిస్తున్న సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వెంకటేశ్ ధోత్రే అన్నారు. శనివారం రెబ్బెన మండలం తక్కలపల్లి గ్రామ పంచాయతీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడుతలో 4 పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన తహశీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వర్లు, పాఠశాల చైర్‌పర్సన్ సుజాత, సమగ్ర శిక్షా క్యాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, హైస్కూల్ హెచ్ఎం మహేశ్వర్, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శంకరమ్మ ఉన్నారు.